మూడవ రోజు సరకుల కోసం అవే తిప్పలు

అబిడ్స్, జూన్ 3 : వర్షాకాలం నేపథ్యంలో ఆహార భద్రత కార్డులకు జూన్ మాసంలో మూడు నెలల సరుకులను అందించాలని ప్రభుత్వం నిర్ణయించగా సాఫ్ట్ వేర్ లో సాంకేతిక సమస్యలతో మూడవ రోజు కూడా నగరంలోని రేషన్ దుకాణాల వద్ద కార్డుదారులకు తిప్పలు తప్పలేదు. అయినప్పటికీ అధికారులు తగిన చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. ఒక్క నెల పాత సాఫ్ట్ వేర్ ద్వారా మూడు నెలల సరుకులను పంపిణీ చేసేలా అధికారులు ఏర్పాటు చేయాలని రేషన్ డీలర్లు అధికారులకు విజ్ఞప్తి చేశారు. మార్చని పక్షంలో నూతన సాఫ్ట్ వేర్ సక్రమంగా పనిచేసేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. గతంలో ఉన్న సాఫ్ట్ వేర్ మార్చడంతో సరుకులు పొందేందుకు ఆహార భద్రత కార్డుదారులకు తిప్పలు తప్పడం లేదు. రేషన్ దుకాణాల ముందు కార్డుదారులు గంటల తరబడి నిలబడాల్సిన పరిస్థితి ఏర్పడింది. మూడు నెలల రేషన్ ఒకేసారి పంపిణీ చేసే విధానంలో మొదటి రోజు రేషన్ డీలర్లు నానా ఇబ్బందులు పడ్డారు. రెండో రోజు కూడా అదే పరిస్థితి నెలకొంది. ఒక్కో ఆహార భద్రత కార్డులో ప్రతి సభ్యునికి ఆరు కిలోల సన్న బియ్యాన్ని ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. అయితే కేంద్ర ప్రభుత్వం పంపిణీ చేసే 5 కిలోలు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా లభించే కిలో బియ్యం వేరు వేరుగా తూకం చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. అంతే కాకుండా మే నెల వరకు ఉన్న సాఫ్ట్ వేర్ కాకుండా నూతన సాఫ్ట్ వేర్ ను అందుబాటులోకి తీసుకురావడంతో తరచూ మొరాయించడం ఒక్కో కార్డుదారునికి కనీస 15 నిమిషాల సమయం పట్టడుతోంది. ఒక కార్డుదారునికి అందించాల్సిన సరుకులను మూడుసార్లు వేలిముద్రలు వేయించుకొని తూకం చేయాల్సిన అవసరం ఉందని, దీంతో అధిక సమయం పడుతుందని తెలిపా రు. దీనికి తోడు గతంలో గోడౌన్ల నుంచి సరఫరా అయిన స్టాకు ఈపాస్ మిషన్‌లో ఆటోమేటిక్ గా కనిపించేది కానీ ఈ నూతన సాఫ్ట్ వేర్ విధానం వలన డీలర్ అప్డేట్ చేసుకోవాల్సిన అవసరం ఉంటుంది. ఈ నెల గత సాఫ్ట్ వేర్ ద్వారానే సరుకుల పంపిణీకి అవకాశం ఇవ్వాలని డీలర్లు ఆహార భద్రత కార్డుదారులు కోరుతున్నారు.

ప్రజల సంక్షేమం కోసం కృషి చేయాలి

ఎల్లప్పుడూ ప్రజల సంక్షేమం కోసం కృషి చేయాలని బండ్ల గూడ జాగిర్ మున్సిపల్ కార్పొరేషన్ మాజీ కార్పొరేటర్ ఎం. రవీందర్‌రెడ్డి అన్నారు. షాదనగర్ నియోజకవర్గం చౌదరిగూడెం మండలం పిర్జాపూర్ గ్రామ మాజీ సర్పంచ్ ఆకుల రాములు జన్మదినం సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు లంగర్‌హౌజ్‌లో మంగళవారం సాయంత్రం సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీజేఎంసీ బీఆర్ఎస్ పార్టీ మాజీ కార్పొరేటర్ ఎం. రవీందర్‌రెడ్డి, మాజీ కార్పొరేటర్లు ఎస్ శ్రీనాథ్‌రెడ్డి, శేఖర్ పాల్గొన్నారు.

–మెహిదీపట్నం, జూన్ 3

నియోజకవర్గ వ్యాప్తంగా డ్రైనేజీ వ్యవస్థ ఆధునీకరణ

కూరగాయల మార్కెట్‌లో డ్రైనేజీ పైప్‌లైన్ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

● ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

అంబర్‌పేట, జూన్ 3 : అంబర్‌పేట నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లో డ్రైనేజీ వ్యవస్థను ఆధునీకరిస్తున్నట్లు ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. నల్లకుంట డివిజన్ శంకరమఠం కూరగాయల మార్కెట్ రోడ్డులో రూ. 3.50లక్షల వ్యయంతో నూతనంగా ఏర్పాటు చేయతలపెట్టిన డ్రైనేజీ పైప్‌లైన్ పనులను డివిజన్ కార్పొరేటర్ వై.అమృతతో కలిసి మంగళవారం ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని కాచిగూడ, నల్లకుంట, గోల్నాక, అంబర్‌పేట, బాగ్‌అంబర్‌పేట తదితర డివిజన్‌లలోని బస్తీలు, కాలనీల్లో పురాతన పైప్‌లైన్ల స్థానంలో కొత్త పైప్‌లైన్లను ఏర్పాటు చేశామని చెప్పారు. ఇప్పటికే చాలా బస్తీలలో నూతన డ్రైనేజీ, మంచినీటి పైప్‌లైన్లను నెలకొల్పడం జరిగిందన్నారు. వీటితో పాటు సీసీ, బీటీ, వీడీసీసీ రోడ్ల నిర్మాణం కూడా చేశామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.

హరిత హారంతో పర్యావరణం క్షేమం

ఉస్మానియా మెడికల్ కాలేజీ ఆవరణలో మొక్కలు నాటుతున్న ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ దిలీప్ భానుశాలి

సుల్తాన్‌బజార్,జూన్ 3: ప్రతి సంవత్సరం 11 మిలియన్ టన్నుల ప్లాస్టిక్ జల వ్యూహాల్లోకి చేరుతుందని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ దిలీప్ భానుశాలి తెలిపారు. మంగళవారం ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని కోఠిలోని ఉస్మానియా మెడికల్ కళాశాల ప్రాంగణంలో ఐఎంఏ హైదరాబాద్ సిటీ బ్రాంచ్ మై క్రో ల్యాబ్స్‌తో కలిసి ఐఎంఏ కోఠి ఉస్మానియా మెడికల్ కాలేజీ ప్రాంగణాలలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన ఉస్మానియా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ రాజారావు, ఒఎం సీ వైద్యాధికారి డాక్టర్ రాకేష్ సాహాయ్‌తో కలిసి మొక్కలను నాటారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్లాస్టిక్ కాలుష్యానికి ముగింపు థీమ్ యునెప్ నేతృత్వంలోని బీట్ ప్లాస్టిక్ పొల్యూషన్ ఉద్యమంతో అనుసంధానంగా, ప్రపంచ వ్యాప్తంగా సముదాయాలను స్థిరమైన పరిష్కారాల దిశగా ప్రేరేపించేందుకు ఉద్దేశించబడిందని అన్నారు. ప్రతి సంవత్సరం 11 మిలియన్ టన్నుల ప్లాస్టిక్ వ్యర్థాలు జలవ్యూహాలలోకి చేరుతున్నాయని, మైక్రోప్లాస్టిక్స్ మురుగునీటి శుద్ధి కేంద్రాలు మరియు డంపింగ్ యార్డుల ద్వారా నేలలో చేరుతున్నాయని అన్నారు. ప్లాస్టిక్ కాలుష్యం వల్ల సంవత్సరానికి 300 బిలియన్ నుంచి 600 బిలియన్ల వరకు ఆర్థిక నష్టాలు జరుగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. ఒకసారి ఉపయోగించే ప్లాస్టిక్‌ను మళ్లీ వాడవద్దని, ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించడంతో పాటు దినచర్యలో ప్లాస్టిక్ వాడకాన్ని పునరాలోచించాలని ఆయన ప్రజలకు సూచించారు. మన భవిష్యత్ కోసం ఆరోగ్యకరమైన ప్రపంచాన్ని నిర్మించడంలో భాగస్వామ్యం కావాలంటే ప్రతి ఒక్కరూ బీట్ ప్లాస్టిక్ పొల్యూషన్ ఉద్యమంలో భాగంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం కార్యక్రమాలలో విరివిగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆధ్యక్షుడు డా. శ్రీరంగ్ అబ్కారి, గౌరవ కార్యదర్శి డా. మిన్హాజ్ నసీరాబాద్, డా. పల్లం ప్రవీణ్‌తో పాటు ఐఎంఏ హైదరాబాద్ సిటీ బ్రాంచ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉద్యమకారుల సమస్యలను విస్మరించిన కాంగ్రెస్

రవీంద్ర భారతి జూన్ 3 : తెలంగాణ ఉద్యమకారులపై రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని వ్యతిరేకిస్తూ అన్ని జిల్లా కేంద్రాల్లో ఆందోళనలు నిర్వహిస్తామని తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ప్రపుల్ రామ్‌రెడ్డి, అధ్యక్షుడు సుల్తాన్ యాదగిరి, ప్రధాన కార్యదర్శి బత్తుల సమ్మయ్య తెలిపారు. తెలంగాణ ఆవిర్భవ దినోత్సవం జూన్ 2న సీఎం రేవంత్‌రెడ్డి తన ప్రసంగంలో ఉద్యమకారుల ప్రస్థానం లేకపోవడం శోచనీయమన్నారు. మంగళవారం బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో వారు మాట్లాడుతూ ఉద్యమకారులకు 250 గజాల స్థలం ఇస్తామన్న ప్రభుత్వం ఇప్పుడు దాని ఊసే ఎత్తడం లేదని మండిపడ్డారు. ఇప్పటికైనా ప్రభుత్వం ఉద్యమకారులకు గుర్తింపు కార్డులు, పెన్షన్ అందజేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జేఏసీ నాయకులు కోతి మాధవి రెడ్డి, క్రిస్టోఫర్, రమేశ్ సాగర్, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నందనవనంలో సమస్యల పరిష్కారానికి చర్యలు

బాగ్‌అంబర్‌పేట డివిజన్ నందనవనంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు కార్పొరేటర్ బి. పద్మావెంకటరెడ్డి తెలిపారు. మంగళవారం కార్పొరేటర్ ఈ కాలనీలో పర్యటించి స్థానికుల నుంచి సమస్యలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్, మిర్యాల శ్రీనివాస్, వెంకట రమణరాజు తదితరులు పాల్గొన్నారు.

– అంబర్‌పేట, జూన్ 3

బతుకమ్మ పండుగకు బతుకమ్మ కుంట సిద్ధం

బతుకమ్మకుంట పునరుద్ధరణ పనులను పరిశీలిస్తున్న హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్

అంబర్‌పేట, జూన్ 3 : వచ్చే బతుకమ్మ పండుగ వరకు బతుకమ్మ కుంట సిద్ధమవుతుందని హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ అన్నారు. బాగ్‌అంబర్‌పేట బతుకమ్మకుంటలో జరుగుతున్న కుంట పునరుద్ధరణ పనులను కార్పొరేటర్ బి.పద్మావెంకటరెడ్డితో కలిసి కమిషనర్ మంగళవారం పరిశీలించారు. ప్రధానంగా కుంటలోపలకి డ్రైనేజీ రాకుండా తీసుకుంటున్న చర్యలను సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. కుంట చుట్టూ తిరుగుతూ పనులను పరిశీలించారు. ఇంకా ఏఏ పనులు చేయబోతున్నారో అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్థానికులు కమ్యూనిటీహాల్‌కు స్థలం కావాలని కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. నందనవనం వైపు కమ్యూనిటీహాల్ కావాలని కోరారు. పరిశీలిస్తామని చెప్పారు. తమ బస్తీలను ముంపు సమస్య లేకుండా చూడాలన్నారు. వైభవ్‌నగర్ కాలనీ వాసులు తమ వరద ముంపు సమస్య పరిష్కరించాలని కోరారు. అక్కడున్న అరవై ఫీట్ల రోడ్డును పునరుద్ధరించాలని వినతిపత్రం సమర్పించారు. అందరి అభిప్రాయాల మేరకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

5న ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవాలు

నిజాం కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఏవీ రాజశేఖర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆయిస్టర్ స్వచ్ఛంద సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు సునీల్ సింగాడే

సుల్తాన్‌బజార్, జూన్ 3 : నిజాం కళాశాలలో ఆయిస్టర్ స్వచ్ఛంద సంస్థ, నిజాం కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్, గ్రీన్ బెల్ట్‌ల ఆధ్వర్యంలో ఈనెల 5న ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవం నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఏ.వీ. రాజశేఖర్ తెలిపారు. మంగళవారం ఆయన తన చాంబర్లో మాట్లాడుతూ.. విద్యతోపాటు పర్యావరణ పరిరక్షణకై విద్యార్థులు ఉపాధ్యాయులు కృషి చేయాలని అన్నారు. ప్రపంచ పర్యావరణ పరిరక్షణ దినోత్సవ సందర్భంగా నిజాం కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటే కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఆయిస్టర్ స్వచ్ఛంద సంస్థ రాష్ట్ర అధ్యక్షులు సునీల్ సింగాడే మాట్లాడుతూ.. సామాజిక కార్యక్రమాలలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని అలాగే విద్యార్థులందరూ మొక్కలు నాటి వాటి పరిరక్షణకై పాటుపడాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఉపాధ్యాయులు డాక్టర్ వై. హేమశ్రీ,డాక్టర్ భవాని శంకర్, ఆయిస్టర్ స్వచ్ఛంద సంస్థ రాష్ట్ర కార్యదర్శి షేక్ సోహెల్, సభ్యులు వైష్ణవి, నిజాం కళాశాల యూనిట్ అధ్యక్షుడు రాథోడ్ శివకుమార్ సభ్యులు మహేశ్, ప్రీతి, రామకృష్ణ, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

సత్కారం

ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్యను సత్కరిస్తున్న రాష్ట్ర కురుమ యువత అధ్యక్షుడు అరుణ్‌కుమార్

అబిడ్స్, జూన్ 3: పొలిటికల్ ఎఫైర్ కమిటీ సభ్యులుగా నియమితులైన ఆలేరు ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య కురుమను కురుమ సంఘం ప్రతినిధులు ఘనంగా సత్కరించారు. రాష్ట్ర కురుమ యువత అధ్యక్షుడు, దొడ్డి కొమురయ్య జయంతి ఉత్సవ కమిటీ చైర్మన్ తూముకుంట అరుణ్ కుమార్ బీర్ల ఐలయ్యను మంత్రుల భవనాల సముదాయంలో సత్కరించారు. ఈ సందర్భంగా బీర్ల ఐలయ్య మాట్లాడుతూ .. తెలంగాణ రాజకీయ వ్యవహారాల కమిటీ సభ్యుడిగా ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ తనపై ఎంతో నమ్మకం ఉంచి నియమించారని ఆయన ఆదేశాల మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేపడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి అర్హులైన వారికీ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తానని తెలిపారు. ప్రభుత్వం చేపడుతున్న సన్నబియ్యం, ఆహార భద్రత కార్డులు, రాజీవ్ యువ వికాసం పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ నెల ఆరవ తేదీన తన పుట్టినరోజు సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆలేరు నియోజకవర్గంలో రూ.1500 కోట్ల నిధులతో అనేక అభివృద్ధి పనులను ప్రారంభించేందుకు విచ్చేస్తుండడం తనకెంతో సంతోషంగా ఉందన్నారు. ప్రతి అభివృద్ధిలో అండగా నిలుస్తున్న మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, ఉత్తంకుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావులకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

బుద్ధ విగ్రహాల పంపిణీ

బుద్ధ భగవానుని విగ్రహాలను పంపిణీ చేసిన బుద్ధిస్టులు

తెలుగు యూనివర్సిటీ, జూన్ 3 : గగన్ మాలిక్ ఫౌండేషన్ సౌజన్యంతో లతారాజా ఫౌండేషన్ ఆధ్వర్యంలో తెలంగాణ సారస్వత పరిషత్తులో ప్రముఖ బుద్ధిస్టులకు బుద్ధ భగవానుని విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేశారు. ప్రముఖ నటుడు, గగన్ మాలిక్ ఫౌండేషన్ అధ్యక్షుడు గగన్ మాలిక్, ప్రముఖ బుద్ధిస్టులు శ్రీరామ మూర్తి, సిద్ధార్థ, లతా రాజా ఫౌండేషన్ వ్యవస్థాపకులు కె కె రాజా, ట్రస్టీ డాక్టర్ సిద్దోజిరావు, రాందాస్, దుర్గా ప్రసాద్ తదితరులు పాల్గొని సమాజంలో తమ వంతు బాధ్యతను నిర్వర్తిస్తున్న 111మంది బుద్ధిస్టులకు ఇత్తడితో తయారు చేసిన ప్రత్యేక విగ్రహాలను బహూకరించారు. ఈ సందర్భంగా బౌద్ధం ప్రాముఖ్యతను, ప్రచారం గురించి వివరించారు.

మూసీ ప్రాంతంలో అంగుళం జాగా కూడా కబ్జా కానివ్వం

మూసీ పరిస్థితిని వివరిస్తున్న తాసీల్దార్ అన్వర్‌హుస్సేన్

అంబర్‌పేట, జూన్ 3 : మూసీ పరీవాహక ప్రాంతంలో అంగుళం జాగా కూడా కబ్జా కానివ్వమని అంబర్‌పేట తాసీల్దార్ అన్వర్ హుస్సేన్ తెలిపారు. మూసీ వెంట గుర్తు తెలియని వ్యక్తులు మట్టి పోసి చదను చేస్తున్నారని పలు వార్తా పత్రికల్లో వరుస కథనాలు రావడంతో మంగళవారం ఆయన తన సిబ్బందితో మూసీ ప్రాంతంలో పర్యటించారు. తమ స్థలం ఉందని అక్కడకు వచ్చిన కొందరిని వెళ్లగొట్టారు. మూసీ బఫర్ జోన్‌లోకి ఎవరిని రానివ్వనని తెలిపారు. వంద మీటర్ల వరకు బఫర్‌జోన్ నిర్ణయించారని చెప్పారు. బఫర్ జోన్‌లోకి వస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రస్తుతం పోసిన మట్టిని తవ్విస్తున్నామని తెలిపారు. వాహనాలు వెళ్లకుండా గుంత తవ్విస్తున్నామని పేర్కొన్నారు.

వేర్వేరు రైళ్లలో దొంగతనాలు

కాచిగూడ,జూన్ 3: కాచిగూడ సూపర్ ఫాస్ట్ రైల్లో దొంగతనం జరిగింది. కాచిగూడ రైల్వే సీఐ ఎల్లప్ప వివరాల ప్రకారం.. జీడిమెట్లకు చెందిన వినయ్ సేతియా(67) సూపర్ ఫాస్ట్ రైల్లో కాచిగూడకు వస్తుండగా అనంతపూర్ రైల్వే స్టేషన్ సమీపంలో గుర్తులను వ్యక్తులు ఆమె బ్యాగును దొంగిలించారు. అందులో ఖరీదైన ఫోన్, రూ. 6,500 నగదు, ఆధార్ కార్డులు, ఏటీఎం కార్డులు, డ్రైవింగ్ లైసెన్స్, విలువైన వస్తువులు దొంగిలించినట్లు పోలీసులు తెలిపారు. మంగళవారం బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని తదుపరి విచారణ అనంతపూర్ రైల్వే పోలీస్ స్టేషన్ కు బదిలీ చేసినట్లు సీఐ తెలిపారు.

మరో సంఘటనలో..

రాజేంద్రనగర్ మంజు దేవి(37)కోయంబత్తూర్ స్పెషల్ రైల్లో కాచిగూడకు వస్తుండగా నాందేడ్ రైల్వే స్టేషన్ సమీపంలో బ్యాగును దొంగిలించారు. అందులో ఫోన్, రూ. 6,300 నగదు, ఆధార్ కార్డు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. బాధితురాలు మంగళవారం రైల్వే పీఎస్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకొని నాందేడ్ రైల్వే పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేసినట్లు రైల్వే సీఐ తెలిపారు.

రైలు కిందపడి యువకుడు ఆత్మహత్య

కాచిగూడ, జూన్ 3: రైలు కింద పడి ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన కాచిగూడ రైల్వే పీఎస్ పరిధిలో జరిగింది. హెడ్ కానిస్టేబుల్ లక్ష్మణాచారి వివరాల ప్రకారం.. శంషాబాద్ గొల్లపల్లి ప్రాంతానికి చెందిన కొత్తపల్లి మహేశ్ కుమార్(27) కారు డ్రైవర్. సోమవారం అర్ధరాత్రి జూకల్–ఉందానగర్ రైల్వే స్టేషన్ వద్ద రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీస్‌లు ఘటనా స్థలానికి చేరుకొని మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు లక్ష్మణాచారి తెలిపారు.

ఫుట్‌పాత్‌పై వృద్ధుడు మృతి

కాచిగూడ, జూన్ 3: కాచిగూడ రైల్వే స్టేషన్ ఆవరణలో మంగళవారం వృద్ధుడు మృతి చెందాడు. ఎస్సై డి.సుభాష్ వివరాల ప్రకారం.. గుర్తుతెలియని వృద్ధుడు(60) కాచిగూడ రైల్వే స్టేషన్ ఎదురుగా ఉన్న హోటల్ ఫుట్ పాత్‌పై అనారోగ్యంతో మృతి చెంది ఉన్నాడు. ప్రయాణికుల సమాచారంతో ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. మృతుని ఒంటిపై నలుపు రంగు టీ షర్టు, కాకి రంగు పాయింట్ ధరించి, ఎత్తు 5.9 ఉన్నట్లు తెలిపారు. వివరాల కోసం 8712660 542 లో సంప్రదించాలని ఎస్సై కోరారు.

అసలైన ఐఎన్‌టీయూసీ మాదే

రవీంద్రభారతి, జూన్ 3: కేంద్రంలో ప్రధాని మోదీ ప్రభుత్వం తీసుకువచ్చిన క్రూరమైన నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయవలసిందే అని, ఈ కొత్త కార్మిక చట్టాలు కార్మికుల ప్రాథమిక హక్కులను కాలరాస్తున్నవి అని ఐ.ఎన్.టి.యు.సి జాతీయ, రాష్ట్ర నేతలు ఆరోపించారు. కార్మికుల హక్కులను నిర్మూలించడానికి నిరంకుశ మోదీ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను ఎదుర్కోవడానికి దేశ వ్యాప్తంగా పెద్దఎత్తున ఉద్యమిస్తామని వారు వెల్లడించారు. హైదరాబాద్, బషీర్ బాగ్, దేశోద్ధారక భవన్ లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఐ.ఎన్.టి.యు.సి జాతీయ సీనియర్ కార్యదర్శులు బాబర్ సలీమ్ పాషా, బి.వెంకటేశ్వరా రెడ్డి, జాతీయ కార్యదర్శి ఆర్.డి. చంద్రశేఖర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు వై. నాగన్న గౌడ్, అదిల్ షరీఫ్, వి. భాస్కర్ రెడ్డి, ఉమా నాగేంద్రమణి, రాష్ట్ర ఉపాధ్యక్షులు జగన్ మోహన్ రెడ్డి, విజయ్ కుమార్ యాదవ్, సోలొమన్ రాజు, సురేష్, నర సింహ రెడ్డి తదితరులు మాట్లాడారు. బాబర్ సలీమ్ పాషా మాట్లాడుతూ కొంతమంది నకిలీ కాంగ్రెస్ నేతలు ఐ.ఎన్.టి.యు.సి ముసుగు వేసుకొని కార్మిక నాయకులుగా చెలామణి అవుతున్నారని, కార్మికులను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు చేస్తున్నారని, ఐ.ఎన్.టి.యు.సి పేరును దుర్వినియోగం చేస్తున్నారని, ఈ ప్రయత్నాలను వారు ఆపకపోతే తాటతీస్తామని హెచ్చరించారు.

సమావేశంలో మాట్లాడుతున్న డీసీపీ చంద్రమోహన్

మెహిదీపట్నం, జూన్ 3: మెహిదీపట్నంలో మహిళ మెడలోని గొలుసు ఓ గొంగ తెంపుకొని పారిపోయాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు మంగళవారం సాయంత్రం మెహిదీపట్నంలోని దక్షిణ పశ్చిమ మండలం డీసీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీసీపీ చంద్రమోహన్, ఆసిఫ్‌నగర్ ఏసీపీ విజయ శ్రీనివాస్, ఇన్స్పెక్టర్ మల్లేశ్‌లతో కలిసి వివరాలను వెల్లడించారు. ఈ నెల ఒకటో తేదీన విజయనగరం కాలనీలో ఉదయం చంద్రకళ అనే మహిళ మెడలో నుంచి గుర్తుతెలియని అగంతకుడు బంగారు గొలుసును తెంపుకొని పారిపోయాడు. బాధితురాలు ఫిర్యాదు మేరకు రంగంలోకి దిగిన పోలీసులు సీసీ పుటేజీల ఆధారంగా మంగళవారం ఉదయం దొంగను పట్టుకున్నారు. టప్పాచబుత్ర జిరా సర్వర్ నగర్‌కు చెందిన మహమ్మద్ నజీబ్ (35) బెట్టింగ్ యాప్ లకు బానిసగా మారి డబ్బులు పోగొట్టుకున్నాడు. దీనికోసం ఇతను గొలుసు దొంగతనానికి పాల్పడ్డాడు. మంగళవారం ఇతని వద్ద నుంచి 1.4 గ్రాముల బంగారు గొలుసును స్వాధీనం చేసుకుని అరెస్టు చేసి రిమాండ్ తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

6న తెలుగు యూనివర్సిటీలో గ్రంథాల ఆవిష్కరణ

తెలుగు యూనివర్సిటీ, జూన్ 3: అక్షర తపస్వి ఆచార్య ఎస్వీ రామారావు 85 వ జన్మదిన సందర్భంగా శతజయంతి సాహితీ మూర్తులు గ్రంథం, విమర్శనారామం గ్రంథాధాల ఆవిష్కరణ సభ జూన్ 6న తెలుగు యూనివర్సిటీ ఆడిటోరియంలో జరుగుతుందని నిర్వాహకులు మరుమాముల దత్తాత్రేయ శర్మ, డా.లలితావాణి సాధన నరసింహాచార్య, డా ఆచార్య ఫణీంద్ర మంగళవారం ఒక ప్రకటన లో తెలిపారు. ఈ సభలో పద్మశ్రీ డా.కొలకలూరి ఇనాక్ ముఖ్య అతిథిగా శతజయంతి సాహితీ మూర్తులు, విమర్శనారామం గ్రంథాలను ఆవిష్కరిస్తారన్నారు. డా. ఆర్.అనంతపద్మనాభరావు అధ్యక్షతన జరగనున్న ఈ సభలో తెలుగు విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య వెలుదండ నిత్యానంద రావు ఆచార్య సాగి కమలాకర శర్మ, సురేశ్ చంద్రశర్మ, డా టి.గౌరీశంకర్ పాల్గొంటారన్నారు. ముందు గా గొల్కొండ సాహితీ వైభవం సాహిత్య రూపక ప్రదర్శన, ఎస్వీ రామారావు గారి తో అనుబంధం కలిగిన సాహిత్య, సాంస్కృతిక సంస్థల సారధులకు సత్కా రం ఉంటుందన్నారు. దాశరథీ స్మారక పురస్కారం, దివాకర్ల, వానమామలై వంటి మహనీయుల స్మారక పురస్కారాలు, 2013లోతెలుగు విశ్వవిద్యాలయం నుంచి ఉత్తమ సాహిత్య విమర్శ పురస్కారం, సనాతన ధర్మ పురస్కారం, సత్కారాలు అందుకున్నారు. రామారావు పర్యవేక్షణలో 19మంది పీహెచ్ డీ పట్టాలు 15 మంది ఎంఫీల్ పట్టాలు పొందారు. ఎన్నో విశేషణాత్మక రచనలతో సాహిత్య రంగంలో విశేష కృషి చేసిన అక్షర తపస్వి ఆచార్య ఎస్వీ రామారావు పాల్గొన్నారు.

మాన్సూన్ వాహనాలు ప్రారంభం

వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా జీహెచ్ఎంసీ అధికారులు తక్షణం స్పందించాలని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొయినుద్దీన్ అన్నారు. మంగళవారం టోలిచౌకిలో మాన్సూన్ ఎమర్జెన్సీ వాహనాలను నానల్‌నగర్ కార్పొరేటర్ నసీరుద్దీన్ తో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈఈ లాల్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

– మెహిదీపట్నం, జూన్ 3

రీవాల్యుయేషన్‌కు దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలోని వివిధ డిగ్రీ కోర్సుల పరీక్ష ఫలితాల రీవాల్యుయేషన్‌కు దరఖాస్తులను స్వీకరించనున్నట్లు అధికారులు తెలిపారు. బీఏ, బీకాం, బీఎస్సీ, బీఎస్సీ ఆనర్స్, బీబీఏ, బీఎస్‌డబ్ల్యూ కోర్సుల నాలుగు, ఆరో సెమిస్టర్ రెగ్యులర్, అన్ని సెమిస్టర్ల బాక్‌లాగ్ పరీక్ష ఫలితాలను ఇప్పటికే విడుదల చేశామని, ఫలితాలను తమ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. మార్కుల మెమోలను సంబంధిత కళాశాల నుంచి మూడు వారాల తర్వాత పొందవచ్చని పేర్కొన్నారు. ఈ ఫలితాల రీవాల్యుయేషన్‌కు ఒక్కో పేపర్‌కు రూ.500 చొప్పున చెల్లించి ఈ నెల 9వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. నకలు పొందగోరువారు ఒక్కో పేపర్‌కు రూ. 1000 చొప్పున చెల్లించి ఈ నెల 11వ తేదీ వరకు తమ కార్యాలయంలో చెల్లించాలని పేర్కొన్నారు.

భర్త ఆత్మహత్య

గోల్నాక, జూన్ 3: ప్రేమించి పెళ్లి చేసుకున్న భార్య అకాల మరణంతో తీవ్ర మనస